

ఫుట్‌పాత్‌పై చెట్లకొమ్మలు తొలగించరూ..

ఖైరతాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భారీ ఈదురుగాలులతో గత శుక్రవారం వచ్చిన వర్షానికి నగరంలోని పలుప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. కొన్నిప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు, మరి కొన్నిచోట్ల జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెట్లకొమ్మలను నరికి ఫుట్‌పాత్‌లపై వేశారు. ఇప్పటి వరకు వాటిని తొలగించకపోవడంతో బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. తెలుగుతల్లి చౌరస్తా సమీపంలో పాత మెడికవర్ ఆస్పత్రి వెళ్లే సమీపంతో పాటు ఎక్బాల్‌మీనార్ వైపు వెళ్లే మార్గాల్లో ఫుట్‌పాత్‌పై ఐదురోజులుగా చెట్లకొమ్మలు ఉన్నా జీహెచ్‌ఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. సచివాలయంతో పాటు బూర్గుల రామకృష్ణారావు భవనం, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఆర్టీసీ బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి వెంటనే ఫుట్‌పాత్‌పై ఉన్న చెట్లకొమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

తెలుగుతల్లి చౌరస్తా సమీపంలో ఫుట్‌పాత్‌పై తొలగించని చెట్లకొమ్మలు



సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్‌మూర్తికి సీఎన్‌జీ ఆధారిత హ్యూండాయ్ ఔరా వాహనాలను అందజేస్తున్న దక్షిణ భారత జోనల్ బిజినెస్ హెడ్ కృపాశంకర్ మిశ్రా, జేఎస్‌పీ హ్యూండాయ్ మేనేజింగ్ డైరెక్టర్ పృద్వీరెడ్డి

సీఎన్‌జీ వాహనాలతో ఇంధన పొదుపు, తక్కువ కాలుష్యం

35 ఔరా సీఎన్‌జీ వాహనాల డెలివరీ

పంజాగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సీఎన్‌జీ వాహనాలు ఇంధన పొదుపుతో పాటు తక్కువ కాలుష్యాన్ని వెదజల్లుతాయని హ్యూండాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ దక్షిణ భారత జోనల్ బిజినెస్ హెడ్ కృపాశంకర్ మిశ్రా అన్నారు. జూబ్లీహిల్స్‌లోని జేఎస్‌పీ హ్యూండాయ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సౌత్ జోనల్ కో-ఆర్డినేటర్ యంగ్‌గ్వాన్ యాన్, రీజనల్ సేల్స్ హెడ్ జి.రామ్‌కుమార్, జేఎస్‌పీ హ్యూండాయ్ మేనేజింగ్ డైరెక్టర్ పృద్వీరెడ్డి సమక్షంలో సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్‌మూర్తికి 35 హ్యూండాయ్ ఔరా సీఎన్‌జీ వాహనాల పత్రాలు, తాళాలు అందజేశారు. పర్యావరణ హిత భవిత దిశగా జేఎస్‌పీ హ్యూండాయ్, సూర్య ట్రావెల్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకుందని పృద్వీరెడ్డి తెలిపారు. స్థిరమైన రవాణా భవిష్యత్తుకు మార్గం అని, కార్పొరేట్ లాజిస్టిక్స్ రంగాలకు సీఎన్‌జీ వాహనాలు అందించడం ద్వారా తక్కువ వ్యయంతో పర్యావరణ హిత పరిష్కారాన్ని అందిస్తున్నామని అన్నారు. త్వరలోనే దక్షిణాదిలో సుమారు 200 వందల సీఎన్‌జీ ఔరా వాహనాలను డెలివరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ సీఎన్‌జీ వాహనాలు కాలుష్యం తగ్గించడంలోనూ, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని నిర్మించడంలోనూ సహకరిస్తాయని తెలిపారు.



విశ్రాంత ఉపాధ్యాయులు పీఎస్‌జీ కృష్ణశర్మను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం

ఎర్రగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను మర్చిపోతున్న ఈ రోజుల్లో 50 సంవత్సరాల క్రితం చదువు చెప్పిన ఉపాధ్యాయుడిని పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఖమ్మం జిల్లాలోని నాలుగు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగానూ, జిల్లా విద్యాశాఖ అధికారిగానూ పనిచేసిన పీఎస్‌జీ కృష్ణశర్మ రాజీవ్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. మంగళవారం ఆయనను అప్పటి విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, కృష్ణయ్య, సురేంద్ర బాబు, రామారావు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

అమీర్‌పేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని సిస్టర్ నివేదిత పాఠశాలలో ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిస్టర్ నివేదిత సెకండరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్, మన శక్తి మన గ్రహం అనే శక్తివంతమైన థీమ్ కింద శక్తివంతమైన, అర్థవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఒక ఆత్మీయ పాట, హత్తుకునే సాహిత్యం, గ్రహం అందాన్ని తెలుపుతూ తల్లి భూమిని సంరక్షించే వారి అభినయం అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. అనంతరం విద్యార్థులు భూమి మూలకాల సామరస్యాన్ని, మానవ నిర్లక్ష్యం పరిణామాలను కళాత్మకంగా చిత్రీకరిస్తూ ఆకర్షణీయమైన ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శన దృశ్యపరంగా అద్భుతంగా ఉండడమే కాకుండా బలమైన భావోద్వేగ ఆకర్షణను కలిగి ప్రేక్షకులను ప్రకృతితో తిరిగి మమేకమవ్వండని సూచించింది. ఈ వేడుకల్లో సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్న కుమార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ సుమాలిని, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ ధర్మేంద్రరావు హాజరయ్యారు. విద్యార్థులకు భూమి, ప్రకృతిపై బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ లలితకుమారి, కరస్పాండెంట్ హరిహరప్రసాద్ పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఐటీసీ కోహినూర్ - ఐకియా మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా ఐకియా వైపు మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 24 గంటల పాటు నిర్ణయించిన మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని, ఈ విషయాన్ని వాహనదారులు గుర్తించి రాకపోకలు సాగించాలని సూచించారు. కేబుల్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలు ఐకియా వెళ్లాలంటే ఐటీసీ కాకతీయ దగ్గర ఎడమవైపు తీసుకొని కొంత దూరం వెళ్లిన తర్వాత వెంటనే కుడివైపు తిరిగి ఆర్‌ఎంజెడ్ బిల్డింగ్ దగ్గర మళ్లీ కుడి వైపు తిరిగి నాలెడ్జ్ సిటీ గేట్ నెం.8 ఎడమవైపు తిరిగి ఐకియా జంక్షన్ వైపు వెళ్లవచ్చని వారు సూచించారు. రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని, ఐటీ ఉద్యోగులు ఈ విషయాన్ని గుర్తించి తమ ప్రయాణాలను కొనసాగించాలని తెలిపారు.

ప్రేయసికి పెళ్లి.. ప్రియుడు బలవన్మరణం

కవాడిగూడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతికి వివాహం కావడంతో ఓ యువకుడు జీవితంపై విరక్తిచెంది ఉరేసుకున్నాడు. ఈ సంఘటన ముషీరాబాద్ పీఎస్ పరిధిలోని భోలక్‌పూర్ ఇందిరాగనర్‌లో సోమవారం రాత్రిచోటు చేసుకుంది. ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భోలక్‌పూర్ ఇందిరానగర్‌లో నివాసం ఉండే గణేష్(20) పదో తరగతి వరకు చదువుకున్నాడు. పద్మారావునగర్‌లోని ఓ ఫిట్‌జిమ్‌లో పనిచేస్తున్నాడు. గణేష్ తల్లి జయశ్రీ సమీపంలోని బంగ్లాదేశ్ దుస్తుల షాపులో పనిచేస్తోంది. చిలకలగూడలో ఓ యువతిని గణేష్ ప్రేమించాడు. ఇటీవల ఆ యువతికి వివాహం కావడంతో జీవితంపై విరక్తి చెందిన గణేష్ భోలక్‌పూర్ ఇందిరానగర్‌లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సాయంత్రం 6 గంటల తర్వాత దుస్తుల షాపు నుంచి ఇంటికి వచ్చి చూడగా ఆమె కుమారుడు గణేష్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ఆమె ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గణేష్ తల్లి ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరద నిలిచే ప్రాంతాల పరిశీలన

- సాఫీగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ

బేగంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో చిన్నపాటి వర్షం పడినా బేగంపేటలోని ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో భారీగా వరదనీరు చేరుతుంది. దీనివల్ల ప్రధాన రహదారిలో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా ప్రకాశ్‌నగర్‌లోని పెట్రోల్‌బంక్ వద్ద భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై అధ్యయనం చేసేందుకు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో పాటు ఇంజనీరింగ్, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులతోపాటు నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్ తదితరులు వరదనీరు నిలిచే ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ప్రధానంగా ప్రకాశ్‌నగర్‌లోని పెట్రోల్‌బంక్ వద్ద నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలించారు. చిన్నపాటి వర్షం పడినా పెట్రోల్‌బంక్‌లోకి భారీగా వరదనీరు చేరుతుందని బంక్ సిబ్బందితో పాటు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విమానాశ్రయం నుంచి భారీగా వర్షం నీరు రావడం.. వచ్చిన నీరు వెళ్లే అవకాశాలు తక్కువగా ఉండడంతో సమస్య నెలకొందని ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. అనంతరం అక్కడ నుంచి నందిని టిఫిన్స్, వెల్కిన్ పార్కు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాలను సందర్శించారు. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో నాలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ, డీఈ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుస్మిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశ్‌నగర్‌లో వరదనీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జోయల్ డెవిస్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధర్మాన్ని గెలిపించాలి

అమీర్‌పేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధర్మాన్ని గెలిపించేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఓటింగ్‌కు వచ్చి బీజేపీ అభ్యర్థి గౌతమ్‌రావుకు మద్దతు తెలిపి గెలిపించాలని బీజేపీ కార్పొరేటర్లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అమీర్‌పేటలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కేతినేని సరళ, కొంతం దీపిక, చీర సుచిత్ర, సుప్రియ, రవిచారి, రచనశ్రీ, పావని విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల యుద్ధంలో ధర్మం వైపు గౌతమ్‌రావు పోటీలో ఉన్నారని, అధర్మం వైపు ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఉన్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పార్టీలని, ఎంఐఎం పార్టీ అన్నదమ్ముల పార్టీ అని విమర్శించారు. ఈ పార్టీలన్నీ ఏకమై అధర్మం కోసం పనిచేస్తున్నాయని, కేవలం బీజేపీ మాత్రమే ధర్మం కోసం, దేశం కోసం, జాతీయవాదం కోసం పనిచేస్తుందన్నారు. నగరంలో అనేక సంవత్సరాలుగా ఎంఐఎం పార్టీ ప్రజలను మోసం చేస్తోందని, భూకబ్జాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ విషయాలను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లంతా తెలుసుకోవాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. అందరూ ఓటింగ్‌కు హాజరై బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో హిందువులపై జరుగుతున్న దాడులను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. దేశంలోకి ఎందరో వలసలు వస్తున్నారని, రోహింగ్యాలు నిండిపోతున్నారని, దీంతో భారతీయుల మనుగడ కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో ధర్మాన్ని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, డివిజన్ అధ్యక్షుడు అనంతుల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌గౌడ్, కార్పొరేటర్లు

జలమండలి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

పంజాగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి ఫైనాన్స్, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, డీజీఎం, జీఎంలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని జలమండలి ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి కోరారు. జలమండలి డైరెక్టర్(పర్సనల్ అడ్మినిస్ట్రేషన్)గా నియమితులైన అబ్దుల్ ఖాదర్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు కె.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన సన్మానించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జలమండలి ఫైనాన్స్, అకౌంట్స్ సిబ్బంది పోస్టుల అప్‌గ్రేడేషన్‌ను వేగవంతం చేసి, ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు గుల్జార్ అహ్మద్, జనార్దన్, కె.కమలాశ్రీ, బి.భీంసింగ్, బి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి సావీర్ కుమార్, కోశాధికారి బి.సాయిచరణ్, నవీన్, శంకరయ్య పాల్గొన్నారు.



అబ్దుల్ ఖాదర్‌ను సన్మానిస్తున్న జలమండలి ఫైనాన్స్, అకౌంట్స్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు



కె.శ్రీలత(466)



ఎస్.అఖిల(466)



బి.శ్రీకళ(984)



ఎం.హేమ(976)



ఎం.స్వప్న(975)



పి.గంగ(974)

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

బోరబండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా బోరబండలోని తెలంగాణ గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యంత ప్రతిభను కనబరిచారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను కె.శ్రీలత(466), ఎస్.అఖిల(466) మార్కులు సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో బి.శ్రీకళ(984), ఎం.హేమ(976), ఎం.స్వప్న (975) మార్కులు, ఎంపీసీ విభాగంలో పి.గంగ(974) మార్కులు సాధించారు. తమ కళాశాల విద్యార్థినులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రత్యేక శ్రద్ధ, ప్రత్యేక తరగతులను నిర్వహించడం ద్వారా ఉన్నత ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.విజయ తెలిపారు.

నిమ్స్‌లో టపాసుల కేసు విచారణ

పంజాగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట నిమ్స్ ట్రామా భవనంలోని ఐదో అంతస్థులో నాలుగు రోజుల క్రితం అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్పందించిన అగ్నిమాపక, నిమ్స్ సిబ్బంది మంటలను ఆర్పారు. అదే అంతస్థులోని ఓ గదిలో అక్రమంగా బాణాసంచా ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేసిన నేపథ్యంలో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆరోగ్యశ్రీ సిబ్బందికి నోటీసులు ఇచ్చారు. నలుగురు సిబ్బందిని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఓ గదిలో బాణాసంచా ఉందని వెలుగులోకి రాగా పోలీసులు వచ్చే సరికి అక్కడి నుంచి మాయం చేశారనే ఆరోపణలు వచ్చాయి. పోలీసులు అన్ని గదులను తనిఖీ చేసినా వారికి మాత్రం బాణాసంచా కనిపించలేదు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఫొటోలు, వీడియోల ఆధారంగా పోలీసులు ఓ గదిలో టపాసులు నిల్వ ఉంచినట్టు అనుమానించినా వారికి మాత్రం అవి లభ్యం కాకపోవడంతో అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. టపాసులు ఎవరు పెట్టమన్నారు, ఎవరు పెట్టారు.. ఎవరు తొలగించారు అంతా సస్పెన్స్‌గా మారింది. ఎవరూ మాట్లాడవద్దని సిబ్బంది, ఉద్యోగులపై ఒత్తిడి వస్తున్నట్టు తెలిసింది. నిమ్స్ ఆవరణ, పలు బ్లాక్‌లలో సీసీ కెమెరాలు ఉండగా, ఐదో అంతస్థులో మాత్రం సీసీ కెమెరాలు లేకపోవడంతో పాటు భద్రతా లోపాలు వెలుగు చూడడంతో పోలీసులు నిమ్స్ యాజమాన్యానికి నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిసింది. అసలైన వారిని వదిలిపెట్టి కిందిస్థాయి సిబ్బందిని బలిపశువు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఎంతటి వారు ఉన్నా వదిలి పెట్టమని పోలీసులు అంటున్నారు. నిమ్స్ ఆవరణలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. టపాసుల కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని భయపడుతున్నారు.

మద్యం విక్రయిస్తుండగా పట్టివేత

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని పక్కా సమాచారంతో మధురానగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ హెచ్‌ఎఫ్‌నగర్‌కు చెందిన షేక్ మహ్మద్ ఆటోడ్రైవర్. సిద్ధార్థనగర్ కమ్యూనిటీహాల్ ఎదురుగా ఉన్న జవహర్‌నగర్ కేఎస్ఆర్ వైన్స్ సమీపంలో బహిరంగ ప్రదేశంలో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నాడు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మహ్మద్‌ని అదుపులోకి తీసుకొని తన వద్ద ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజ్ చేసిన భవనాలే వ్యాపార కేంద్రాలు

- నాలుగు నెలల క్రితం అక్రమ నిర్మాణాలంటూ 30 భవనాలను సీజ్ చేసిన అధికారులు
- ఆ తర్వాత పది రోజులకే తిరిగి నిర్మాణ పనులు ప్రారంభం
- పట్టించుకోని అధికారులు
- నిర్మాణాలు పూర్తి చేసి అద్దెకిచ్చిన యజమానులు



అధికారులు సీజ్ చేసిన నిర్మాణంలో ఉన్న భవనం (ఫైల్)



నిర్మాణం పూర్తిచేసి హాస్టల్‌కు అద్దెకిచ్చిన సీజ్ చేసిన భవనం



ఓ భవనాన్ని సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)

గచ్చిబౌలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న సుమారు 30 భవనాలను గతంలో అధికారులు సీజ్ చేశారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు నాలుగు నెలల క్రితం భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారంటూ హడావిడి చేసి భవనాలను సీజ్ చేశారు. పది రోజులు కూడా గడవకముందే నిర్మాణదారులు అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి యథావిధిగా పనులు చేసుకోవడంతో పాటు గృహప్రవేశాలు సైతం పూర్తి చేసి హాస్టళ్ల నిర్వాహకులకు అద్దెకు ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు, కిందిస్థాయి సిబ్బంది నిర్మాణదారులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజ్ చేసిన భవనాల్లో పనులు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరుకు సందుల్లో భారీ భవనాలు

సిద్దిక్‌నగర్‌లో ఓ నిర్మాణదారుడు భవన నిర్మాణం కోసం 60 గజాల్లో సెల్లార్ తీయడంతో పక్కనే ఉన్న ఐదంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. గతేడాది నవంబర్ 19న ఈ ఘటన జరిగింది. దీంతో ఆ భవనంలో ఉన్నవారిని, పరిసర భవనాల్లో ఉన్నవారిని అధికారులు ఖాళీ చేయించారు. భారీ యంత్రాలతో ఒరిగిన భవనాన్ని నేలమట్టం చేశారు. కూల్చివేతలు జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతానికి కనీసం ఫైర్ ఇంజన్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాంటి ప్రాంతాల్లో ఇరుకైన సందుల మధ్య 6,7,8 అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. సిద్దిక్‌నగర్‌పై అధికారులు దృష్టి సారించి ఆ సమయంలో సుమారు 30 భవనాలను సీజ్ చేసి బ్యానర్లు కట్టారు. అప్పట్లో ఈ విషయం శేరిలింగంపల్లిలో సంచలనంగా మారింది. అయితే, నాలుగు నెలల క్రితం అధికారులు హడావిడి చేసి సీజ్ చేసిన భవనాలు నేడు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. కొన్ని నివాస భవనాలుగా మారగా, మరికొన్ని వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కు కావడంతో ఇలాంటి పరిస్థితి ఉందని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరమణను వివరణ కోరగా, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్, నీటి వసతి ఎలా కల్పించారు?

అక్రమ నిర్మాణాలంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ భవనాలను సీజ్ చేశారు. అయితే, ఇతర విభాగాలకు చెందిన అధికారులు సీజ్ చేసిన భవనాలకు మౌలిక వసతులు ఎలా కల్పిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సీజ్ చేసిన భవనాలకు విద్యుత్ మీటర్లు, వాటర్ కనెక్షన్లు ఎలా ఇచ్చారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పనితీరుకు నిదర్శనం

సిద్దిక్‌నగర్‌లో జరిగే సంఘటనలు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలంటూ సీజ్ చేస్తారు. పది రోజుల్లోనే తిరిగి పనులు జరుగుతుంటే ఎవరూ పట్టించుకోరు. నాలుగు నెలల్లో పనులు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయడం, అద్దెలకు ఇవ్వడం చకచకగా జరిగిపోయాయి. నిర్మాణదారులకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

● ఎల్లేష్, స్థానికుడు



ప్రజావాణిలో వినతి పత్రం సమర్పిస్తున్న రుద్రవీణ మహిళా సంఘం ప్రతినిధులు

ప్రజావాణికి వినతి

అడ్డగుట్ట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి పంపిణీ చేయాలని అడ్డగుట్ట శాస్త్రినగర్‌కు చెందిన రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ మంగళవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఆమె అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అడ్డగుట్ట శాస్త్రినగర్‌లో ఉన్న అర్హులైన వారికి ఇళ్ల సర్వే పూర్తయిందని, బస్తీ వాసులకు ఇళ్లను పంపిణీ చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించామన్నారు. ప్రజావాణిలో రుద్రవీణ మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

బౌద్ధనగర్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో 27న తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. మంగళవారం ముఖ్యకార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సభను విజయవంతం చేయటానికి సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్ని డివిజన్ల నుంచి అధికసంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావడానికి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. బౌద్ధనగర్ డివిజన్ నుండి అధికసంఖ్యలో ఈ సభకు తరలిరావాలని కార్పొరేటర్ సూచించారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, కన్వీనర్ రాజు సుందరం, నాయకులు పాకసాయి, మల్లేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న దివ్యాంగుల వివాహ పరిచయ వేదిక

అడ్డగుట్ట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మలక్‌పేట్‌లోని ముంతాజ్ కాలేజ్ రోడ్డు ఎంఎస్-1 సూపర్‌బజారులోని సర్ లూయిస్ బ్రెయిల్ పార్కులో దివ్యాంగులకు వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు గ్రేషియా తెలిపారు. ఈ పరిచయ వేదికకు వచ్చే ముందు దివ్యాంగుల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు వెంట తీసుకుని రావాలి. వివరాలకు 7660870137, 8688255252, 7995385941 నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది.



కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు పవన్‌స్వామి, దీపక్ స్వామిలు

కన్నుల పండుగలా వేంకటేశ్వరస్వామి కల్యాణం

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ నక్షత్రం పురస్కరించుకుని బోయినపల్లి న్యూసిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాస కల్యాణం మంగళవారం కన్నుల పండుగలా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన మహాప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, జగన్నాథం, లక్ష్మణ్, రామ్మోహన్‌లతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం కోసం ఓ భక్తుడు సుమారు రూ.10 లక్షలతో అందజేయనున్న ఉత్సవ రథం కోసం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. త్వరలో రథం నిర్మాణ పూజా కార్యక్రమాలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆత్మహత్యాయత్నం.. యువతిని కాపాడిన పోలీసులు



నాన్సీ (ఫైల్)

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఓ యువతి ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించింది. బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన చంద్రయ్య, విలసిని రాణి దంపతులు. ఓల్డ్ బోయినపల్లి మల్లికార్జున కాలనీలో కుమారుడు ఫ్రెడ్రిక్, కూతురు నాన్సీ (25)లతో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే నాన్సీ కొంతకాలంగా అంశుమాన్‌తో ప్రేమలో పడింది. ఈ విషయం ఇంటిలో తెలిపింది. అయితే పెళ్లి చేసుకుందాము అనుకున్న వీరిద్దరికి నాన్సీ కుటుంబ సభ్యులు కాస్త సమయం కావాలని తెలిపారు. మనస్తాపానికి గురైన నాన్సీ సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయి ఆత్మహత్య చేసుకోబోతున్నాను అని తల్లికి ఫోన్ చేసి చెప్పి తన ఫోన్ స్విచ్చాప్ చేసింది. దీంతో భయాందోళనకు గురైన తల్లి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా అన్నిచోట్ల వెతకడం ప్రారంభించారు. అయినా ఫలితం లేదు. కాగా మధ్యరాత్రి నాన్సీ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు నాన్సీ ట్యాంక్ బండ్ వద్ద ఉందని గుర్తించారు. దీంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు అందులో దూకడానికి సిద్ధంగా ఉన్న నాన్సీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌన్సిలింగ్ చేసిన పోలీసులు ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృత్యువు కోరల్లోకి వెళ్ళిన యువతిని కాపాడిన పోలీసులకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి జైలుశిక్ష



భానుప్రసాద్ (ఫైల్)

బౌద్ధనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడికి మూడురోజులు జైలుశిక్ష పడిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ ప్రకారం పార్శీగుట్టకు చెందిన మదుగాని భానుప్రసాద్(26) స్క్రాప్ వ్యాపారం చేస్తుంటాడు. 20న రాత్రి భానుప్రసాద్ మద్యం సేవించి స్థానికంగా నివసిస్తున్న మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి దూషించాడు. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు భానుప్రసాద్‌పై ఈ-పెట్టి కేసును నమోదు చేసి మంగళవారం సికింద్రాబాద్‌లోని ప్రత్యేక పదిహేనవ కోర్టు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.రవిశంకర్ ముందు హాజరుపర్చారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడు భానుప్రసాద్‌కు మూడు రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



సతీష్ (ఫైల్)

బౌద్ధనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సొంత గ్రామానికి వెళుతున్నానని బంధువులకు చెప్పి వెళ్లిన ఓ యువకుడి అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా కెటీదొడ్డి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన లింగామ్మగారి సతీష్(20) ఎస్‌ఆర్‌నగర్‌లో లక్ష్మణ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ బ్యాంక్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. 15న సతీష్ రాంనగర్‌లోని బంధువులకు ఇంటికి వచ్చాడు. 16న ఉదయం 11 గంటలకు ట్రైన్‌లో కొండాపూర్ వెళుతున్నానని బంధువులకు చెప్పి బయలు దేరాడు. 19న తండ్రి రంగారెడ్డి సతీష్‌కు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో తన అల్లుడు సతీష్ కనిపించటం లేదని అత్తయ్య నూనె స్వప్న సోమవారం రాత్రి వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్‌లో సత్తా చాటిన ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు

మారేడుపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మారేడుపల్లిలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలలోని ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో బి. ప్రవల్లిక బైపీసీ 991, టి. మౌనిక ఎంపీసీ 991, జువిరియా మున్నిస్సా ఎంఎల్‌టీ 980, మారుక్ బేగం సీఈసీ 978, ఎం. భార్గవి ఎంఎల్‌టీ 971, ఎస్.భావన ఎంపీసీ 967. మొదటి సంవత్సరంలో సాయి వైష్ణవి ఎంఈసీ 495, సఫా ఫాతిమ ఎంఈసీ 494, మార్వా ఫాతిమ ఎంసీఈ 489, ముస్కాన్ బేగం ఎంఎల్‌టీ 486, బి.ప్రవీణా హెచ్‌ఈఎస్ 485 సికింద్రాబాద్ మహేంద్రాహిల్స్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న బాలికలు 98.7 శాతంతో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శీలం సునీత తెలిపారు. అదేవిధంగా మారేడుపల్లిలోని మునగా రామ్మోహన్‌రావు బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి నాగరాని వారిని అభినందించారు.

● మారేడుపల్లి రాఘవ లక్ష్మీదేవి ప్రభుత్వ జూనియర్ కో- ఎడ్యుకేషన్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జి.ప్రీతి ఎంపీసీలో 464, ద్వితీయ సంవత్సరం చదువుతున్న సింహాద్రి సీఈసీలో 976, విష్ణు వర్ధన్ ఎంపీసీలో 968, ఎం. కార్తిక్ ఎంపీసీలో 967 మార్కులు సాధించారు. బాల బాలికలు 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థినీ, విద్యార్థులను ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి అభినందించారు.

రెజిమెంటల్‌బజార్..

సికింద్రాబాద్ న్యూ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ద్వితీయం సంవత్సరం ఎంపీసీ విభాగంలో కైలాష్‌రెడ్డికి 966/1000, బైపీసీ విభాగంలో రాఘవేందర్‌కు 961/1000, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో రుష్యంత్ 459/470, నితిన్ 445/470 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

చిలకలగూడ..

రైల్వే జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.అఖిల్ కుమార్ ఎంపీసీలో 986, యూ.మమత 962, యూ.భాగ్యశ్రీ 948 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. కళాశాల ప్రిన్సిపల్, తోటి విద్యార్థులు వారికి అభినందనలు తెలిపారు.



బి.ప్రవల్లిక | టి.మౌనిక | మారుక్ బేగం | ఎం.భార్గవి | ఎస్.భావన

సాయి వైష్ణవి | సఫా ఫాతిమా | మార్వ ఫాతిమా | ముస్కాన్ బేగం | జీ.ప్రీతి

సింహాద్రి | విష్ణువర్ధన్ | ఎం.కార్తీక్ | పి.తరుణి | కె.అంజలి

సరస్వతీ పుత్రులు.... ఈ విద్యార్థినులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వారు పేద కుటుంబంలో పుట్టినప్పటికీ, తల్లిదండ్రుల కష్టంతో, బాగా చదువుతూ ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. భవిష్యత్‌లో కుటుంబానికి, దేశానికి మంచి పేరు తీసుకువస్తామని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు.

సయ్యదా ఆరిఫా సిద్ధిఖాకు ముబారక్ చెప్పిన తండ్రి



వారాసిగూడకు చెందిన సయ్యదా ఆరిఫా సిద్ధిఖా ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూప్ చదువుతోంది. తాజాగా వెలువడిన ఫలితాల్లో 436 మార్కులు సాధించింది. తండ్రి సయ్యద్ అస్లాం హుస్సేన్ ఓ మసీదులో ఇమాంగా సేవలు అందిస్తున్నారు. తల్లి నాస్యా బేగం గృహిణి. సయ్యదా ఆరిఫా సిద్ధిఖా మొదటి నుంచి చదువులో మేటిగా రాణిస్తోంది. తాను మరింత బాగా చదివి, డాక్టర్ అవుతానని చెబుతోంది.

శ్వేతాసింగ్‌ను అభినందిస్తున్న తల్లి



న్యూబోయినపల్లికి చెందిన పూనంసింగ్ చౌహాన్, అరవింద్ సింగ్ చౌహాన్‌ల కుమార్తె శ్వేతా సింగ్ వెస్ట్‌మారేడుపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బీపీసీ గ్రూప్ చదువుతోంది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 434 మార్కులు సాధించింది. తల్లి గృహిణి కాగా తండ్రి వ్యాపారస్తుడు.

సీతాఫల్‌మండి..

ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇంటర్ ఫలితాలు పర్సంటేజ్ తక్కువ ఉన్నా మార్కులు అధికంగా సాధించారు. రెండో సంవత్సరం చదువుతున్న పి.తరుణి, సీఈసీ(868/1000) కె.అంజలి, ఎంఈసీ(855/1000) కాలేజీ మొదటి ర్యాంకులు సాధించగా, యష్మీన్‌బేగం, ఎంఈసీ(829/1000), ఎండీ సోఫియన్ సీఈసీ (816/ 1000) రెండో ర్యాంకులు సాధించించారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.వైష్ణవి, సీఈసీ(472/500) కాలేజీ మొదటి ర్యాంకు సాధించగా, ఎం.ప్రగతి సీఈసీ(467/500), ఆమ్రిన్‌బేగం సీఈసీ(467/500)లు కాలేజీ రెండో ర్యాంకులు సాధించారు. ఎంఈసీలో ఎం.కృష్ణ(443/500)తో కాలేజీ మొదటి ర్యాంకుతో పాసైయ్యాడు. వీరిని జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

వరంగల్ సభకు తరలి రావాలి

తిరుమలగిరి ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే, కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు 27న వరంగల్‌లో తలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని వార్డ్-7లో మాజీ బోర్డు సభ్యులు ప్యారసాని శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి టీఎస్ బీసీఎల్ మాజీ ఛైర్మన్ గజ్జెల నాగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు గర్వపడేలా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, ప్రజల మన్ననలను పొందిన ప్రభుత్వం కేసీఆర్‌ది అని గుర్తు చేశారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు నగరం నుంచి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో వరంగల్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల రుక్మయ్య, వార్డు-7 ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, చిన్నన్న, బీసీ విభాగం ఉపాధ్యక్షులు ఉమేష్, సోషల్ మీడియ కన్వీనర్ రాజా రెడ్డి, రాగిణి, నంద కుమార్, సువర్ణ, మహిళ ఉపాధ్యక్షురాలు అనురాధ రెడ్డి, మ్యాగీ, విక్టోరియా, వేణుగోపాల్, జాన్ వినోద్, రాకేష్, లక్ష్మీపతి, మైనారిటీ విభాగం అధ్యక్షురాలు శకుంతల, సురేష్, పెరుమాళ్, సత్యానారాయణ గౌడ్‌లు పాల్గొన్నారు.



జై తెలంగాణ నినాదాలు చేస్తున్న గజ్జెల నాగేష్

రాజీవ్ యువవికాసం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి

● **తహసీల్దార్ పాండు నాయక్**



తహసీల్దార్ పాండు నాయక్

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువవికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు 26వ తేదీలోగా ఆయా వార్డు కార్యాలయంలో పత్రాలను సమర్పించాలని సికింద్రాబాద్ తహసీల్దార్ ఇస్లావత్ పాండు నాయక్ సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను 14వ తేదీ వరకు స్వీకరించిన విషయం విదితమే. సికింద్రాబాద్ మండల పరిధిలో ఏడువేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఏయే పత్రాలను అప్‌లోడ్ చేశారో వాటి హార్డ్ కాపీలను వార్డు కార్యాలయంలో సంబంధిత అధికారులకు సమర్పించాలని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గిన్నిస్ రికార్డు సాధించిన రిత్విక్



గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థి పి.రిత్విక్ సాగర్‌ను అభినందిస్తున్న జంపన ప్రతాప్

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయనడానికి పి.రిత్విక్ సాగర్ ఉదాహరణ అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. బోయినపల్లి కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్న పి.రిత్విక్ కీబోర్డు ప్లేయర్‌గా గిన్నిస్ రికార్డు సాధించాడు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అతడిని అభినందించారు. కీ బోర్డు ప్లేయర్‌గా ఆసక్తి కనబరిచి ఆన్‌లైన్ క్లాస్‌లో చేరి హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా అవకాశం రావడంతో రికార్డు సాధించాడని జంపన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పవన్, వరప్రసాద్, శశి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వీడ్కోలు

బౌద్ధనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తాటి పద్మ పదవి విరమణ కార్యక్రమం మంగళవారం సీతాఫల్‌మండి మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. తోటి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తాటిపద్మ దంపతులను ఘనంగా సత్కారించారు. ముషీరాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి శ్రావణ్, ఎస్‌టీయూటీఎస్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ఈ కార్యక్రమంలో పాల్గొని తాటి పద్మకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కెబి.జయలక్ష్మీ, శోభారాణి, డాక్టర్ రమేష్, వై.పద్మజ, సుజాతతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పద్మ చేసిన సేవలను పలువురు కొనియాడారు.



వరల్డ్ ఎర్త్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పర్యావరణ స్థిరత్వ వ్యక్తి చారుద్యాయనిని సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో వరల్డ్ ఎర్త్ డే

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఎర్త్ డేను పురస్కరించుకుని బోయినపల్లి సీతారాంపురంలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో స్టార్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ పేరిట మంగళవారం సాయంత్రం 5:30 నుంచి 7 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యావరణ స్థిరత్వం, చారుద్యాయని ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అల్ఫోన్స్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణలతో కలిసి స్టార్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ వరల్డ్ ఎర్త్ డే పై విద్యార్థులకు, తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు చెట్ల పెంపకం, నాటడం, కాలుష్యం గురించి ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చారుద్యాయని మాట్లాడుతూ పర్యావరణం గురించి ప్రజలను ప్రోత్సహించడం, ఈ రోజును జరుపుకోవడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణంపై ప్రేమ, శ్రద్ధ పెరుగుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లితండ్రులు, బంధువులకు ఆయన పాఠశాల యాజమాన్యం తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు పర్యావరణాన్ని పరిరక్షించడంలో వ్యక్తిగత చర్యల ప్రాముఖ్యతను మరింత స్థిరమైన భవిష్యత్తును సృష్టించడంలో వారు పోషించగల పాత్రను అభ్యసించగలుగుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బోయినపల్లి ప్రాంతంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సాయంత్రం చీకటి పడిన తర్వాత మ్యాజిక్ లైట్లు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లతో కళ్లకు కట్టినట్లు ఆకాశంలో ఉన్నట్లుగా, ఆకాశంలోని చుక్కలు పక్కనే ఉన్నట్టుగా చూపించిన విధానం అందరిని విశేషంగా ఆకర్షించింది.

వరదనీరు నిలిచే ప్రాంతాల పరిశీలన

● **సాఫీగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ**

బేగంపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో చిన్నపాటి వర్షం పడినా బేగంపేటలోని ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో భారీగా వరదనీరు చేరుతుంది. దీనివల్ల ప్రధాన రహదారిలో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా ప్రకాశ్‌నగర్‌లోని పెట్రోల్‌బంక్ వద్ద భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై అధ్యయనం చేసేందుకు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో పాటు ఇంజనీరింగ్, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులతోపాటు నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్ తదితరులు వరదనీరు నిలిచే ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ప్రధానంగా ప్రకాశ్‌నగర్‌లోని పెట్రోల్‌బంక్ వద్ద నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలించారు. చిన్నపాటి వర్షం పడినా పెట్రోల్‌బంక్‌లోకి భారీగా వరదనీరు చేరుతుందని బంక్ సిబ్బందితో పాటు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విమానాశ్రయం నుంచి భారీగా వర్షం నీరు రావడం.. వచ్చిన నీరు వెళ్లే అవకాశాలు తక్కువగా ఉండడంతో సమస్య నెలకొందని ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. అనంతరం అక్కడ నుంచి నందిని టిఫిన్స్, వెల్కిన్ పార్కు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాలను సందర్శించారు. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో నాలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ, డీఈ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుస్మిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశ్‌నగర్‌లో వరదనీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జోయల్ డెవిస్

సంతాపంగా సూచకంగా..







సచివాలయం, ట్యాంక్‌బండ్, ఐజీసీటీల వద్ద జాతీయ జెండాలను పోప్ ఫ్రాన్సిస్ మృతికి సంతాప సూచకంగా అవనతము చేశారు

ప్రత్యేక ప్రార్థనలు



పోప్ ఫ్రాన్సిస్ అస్తమయంతో నగరంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పోప్ చిత్రపటానికి క్రైస్తవ పెద్దలు, సోదరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పోప్ చిత్రపటానికి కార్డినల్ పూల ఆంథోని, బిషప్‌లు, పాస్టర్‌లు, క్రైస్తవులు నివాళులు అర్పించారు.

(సికింద్రాబాద్/ రెజిమెంటల్‌బజార్-ఆంధ్రజ్యోతి)